# సాక్షి ఏలూరు

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



## అందరికీ ఆరోగ్య సురక్ష
జిల్లావ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి క్యాంపులు ప్రారంభం కానున్నాయి.
8లో ▸



## బాబాయ్ అరెస్టు
భీమవరం లెప్రసీ కాలనీలో బాలిక హత్య కేసులో నిందితుడు వరునకు బాబాయ్ అయిన శివను అరెస్టు చేసినట్లు ఎస్పీ చెప్పారు.
8లో ▸



## బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం
మార్టేరులో నాలుగు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి 9వ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి.
8లో ▸

# తీగలకు రాజకీయ అడ్డంకులు

- మెరుగైన విద్యుత్ సరఫరాకు సర్కారు యత్నం
- భూములివ్వని ప్రతిపక్ష మద్దతుదారుల వైఖరి
- ఉమ్మడి మూడు జిల్లాలకు కష్టకాలం
- ఉన్నతాధికారుల ఉదాసీనతా కారణం

**సాక్షి, ప్రత్యేక ప్రతినిధి:** ఏటేటా పెరుగుతున్న అవసరాలు, వినియోగానికి తగినట్లు విద్యుత్ పంపిణీకి మెరుగైన ఏర్పాట్లకు గత టీడీపీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలను రూపొందించుకుని అమలు చేయనందున వినియోగదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. విద్యుత్ సరఫరాలో నిరంతర అవాంతరాలతో ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన లక్షలాది మంది వినియోగదారులు సమస్యల పరిష్కారానికి ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. తక్షణ ఇబ్బందులను తొలగించడంతో పాటు భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండేళ్ల కిందటే చర్యలను చేపట్టింది. పక్కా ప్రణాళిక ప్రకారం పనులు పూర్తయి విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగితే వినియోగదారుల నుంచి ప్రభుత్వానికి సానుకూలత ఏర్పడుతుందనే భావనతో ఆయా గ్రామాల్లో పెద్ద రైతులుగా చలామణి అవుతున్న పలువురు సహాయ నిరాకరణను కొనసాగిస్తున్నారు. తమతో పాటు భూములు ఇవ్వకుండా ఇతర రైతులను కూడా ఉసిగొల్పుతున్నారని సంబంధిత ఉన్నతాధికారులకు నిర్దిష్టమైన సమాచారం ఉంది. ఇలా చేస్తున్న వారిలో ప్రతిపక్ష పార్టీకి అనుకూలురైన వారున్నారని తెలుస్తోంది.



**400 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణంతో పాటు..**

కృష్ణా, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో అంతరాలు లేని విద్యుత్ సరఫరాకు వీలుగా కృష్ణా జిల్లా యలపర్రు వద్ద 400 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణంతో పాటు అందుకు అవసరమైన ఫీడర్, లైన్ల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. ఎంఈఐఎల్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుని పనులు చేపట్టింది. గన్నవరం, గుడివాడ, పామర్రు నియోజకవర్గాల పరిధిలోని బాపులపాడు, తేలప్రోలు, ఉంగుటూరు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, ముక్కపాడు, వింజరంపాడు, వెంట్రప్రగడ, చిన్నపారుపూడి, పెద్దపారుపూడి మీదుగా యలపర్రుకు 400 కేవీ విద్యుత్ లైన్ వెళ్లాల్సి ఉంది.

**రాజకీయ దురుద్దేశంతో..**

విద్యుత్ లైను నిర్మాణం జరగాలంటే నిర్దేశిత మార్గంలోని భూమి నిర్మాణ సంస్థకు అందుబాటులో ఉండాలి. పనులకు అడ్డంకులు తలెత్తకూడదు. కానీ పై గ్రామాల పరిధిలోని రైతులు ప్రతిపక్ష పార్టీకి అనుకూలురైన పలువురు ఉద్దేశపూర్వకంగానే మోకాలడ్డుతున్నారు. మూడు జిల్లాల పరిధిలోని లక్షలాది మంది విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నానికి సహాయ నిరాకరణ చేయడాన్ని అందరూ తప్పు పడుతున్నారు.

**ఉన్నతాధికారుల జోక్యం అవసరం**

విద్యుత్ లైను నిర్మాణం త్వరితగతిన సాగాలన్నా, మూడు జిల్లాల వినియోగదారులకు విద్యుత్ కష్టాలు తీరాలన్నా రెవెన్యూ, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా అధికారులు సంబంధిత నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల సహకారంతోనైనా సమస్యను పరిష్కరించే ప్రయత్నాలు చేసి ఉండాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### పోలవరం కుడి కాలువ తవ్వకం సమయంలో..

రాష్ట్రానికి వరప్రదాయిని అయిన పోలవరం ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి అందరి కలలను సాకారం చేయాలని ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తలచారు. ప్రాజెక్టు నిర్మాణం రూపుదిద్దుకునే లోపు కుడి, ఎడమ కాలువలను కూడా తవ్వించి నీటిని మళ్లించాలని పనులు ప్రారంభింపచేశారు. కుడి కాలువ పనులు ముందుకు సాగకుండా చేసే ఉద్దేశంతో ప్రతిపక్ష పార్టీకి చెందిన ఆ ప్రాంత నాయకులు, రైతులు ఎక్కడికక్కడ అడ్డంకులు సృష్టించారు. కోర్టులను ఆశ్రయించారు. భూములు ఇవ్వకుండా, కాలువ పనులను అడ్డుకోగలిగారు. కానీ భూసమీకరణకు అంగీకరించి తమ భూములను అప్పగించిన ప్రాంతాల్లో మాత్రం కాలువ తవ్వకం పనులను వైఎస్సార్ కొనసాగింపచేశారు. ఆ తరువాత పట్టిసీమ పేరిట టీడీపీ సర్కారు చేపట్టిన ప్రాజెక్టుకు అదే రైతులు సహకరించి భూములు అప్పగించడంతో బిట్లుబిట్లుగా ఆగిపోయిన పోలవరం కుడి కాలువ పనులను పూర్తిచేసి నీటిని విడుదల చేయగలిగారు. ఇప్పుడు కూడా పోలవరం కాలువ పనులకు అడ్డంకులు సృష్టించిన రీతిలోనే విద్యుత్ లైను నిర్మాణానికి మోకాలడ్డుతున్నారనేది తేటతెల్లం అవుతోంది.

## పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు



కార్యదర్శులకు సూచనలిస్తున్న డీపీఓ విశ్వనాథ్

**ఏలూరు(మెట్రో):** జగనన్న స్వచ్ఛ సంకల్పంలో సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో కార్మికులు, వారి కుటుంబ సభ్యుల కోసం వచ్చేనెల 2న ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని డీపీఓ, డీఎంహెచ్ఎంను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. దీనిలో భాగంగా డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ శుక్రవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా జరుగనున్న ఈ ప్రత్యేక ఆరోగ్య పరీక్ష కార్యక్రమంలో 27 మండలాల నుంచి 1,385 మంది పారిశుద్ధ్య కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా పాల్గొంటారన్నారు. ఈ మేరకు ప్రతి కార్మికుడికి ముందస్తు సమాచారం అందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు దగ్గరుండి తీసుకెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించాలని డీపీఓ సూచించారు. పీహెచ్‌సీల్లో ప్రాథమిక ఆరోగ్య పరీక్షలతో పాటు రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు విజయవంతం కావడానికి విస్తరణ అధికారులను, డివిజనల్ పంచాయతీ అధికారులను విధుల్లో నియమించామని డీపీఓ చెప్పారు.

## న్యూస్‌రీల్

### ఆటోడ్రైవర్ అవతారమెత్తిన ఎమ్మెల్సీ జయమంగళ



ఆటో నడుపుతున్న ఎమ్మెల్సీ వెంకటరమణ

**గణపవరం:** శాసనమండలి సభ్యుడు జయమంగళం వెంకటరమణ ఆటో డ్రైవర్ అవతారం ఎత్తారు. శుక్రవారం గణపవరంలో వైఎస్సార్ వాహనమిత్ర ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ఆయన గణపవరం డిగ్రీ కాలేజీ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ఆటోడ్రైవర్లు నిర్వహించిన ప్రదర్శనలో ఎమ్మెల్యే వాసుబాబు, టీటీడీ సభ్యుడు గాదిరాజు సుబ్బరాజుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు, సుబ్బరాజును ఆటో ఎక్కించుకుని ఎమ్మెల్సీ వెంకటరమణ స్వయంగా ఆటో నడుపుతూ పార్టీ శ్రేణులను, ఆటో డ్రైవర్లను ఉత్సాహపరిచారు.

### విధి నిర్వహణలో పోటీపడాలి



ప్రత్యూషను అభినందిస్తున్న కలెక్టర్

**ఏలూరు(మెట్రో):** ఏపీపీఎస్సీ గ్రూప్–1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించి ఏలూరు జిల్లాకు డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన జి.భానుశ్రీలక్ష్మి అన్నపూర్ణ ప్రత్యూష శుక్రవారం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి అందరి మెప్పు పొందాలన్నారు. విధి నిర్వహణలో పోటీపడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

### మేజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**భీమవరం (ప్రకాశంచౌక్):** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయడానికి, అర్హులైన అభ్యర్థులను ప్యానెల్‌లో పేర్లను చేర్చడానికి దరఖాస్తులను కోరుతున్నట్టు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్ట్స్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి సి.పురుషోత్తంకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరులో రెండు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, కొవ్వూరులో ఒకటి చొప్పున మొత్తం ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. నెలకు రూ.30 వేలు గౌరవ వేతనంగా చెల్లిస్తారని, వచ్చేనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు ఏలూరులోని తమ కార్యాలయంలో అందించాలని సూచించారు. అమలులో ఉన్న నిబంధనల ప్రకారం, అభ్యర్థులకు నిర్దేశించిన అర్హతలు తప్పక కలిగి ఉండాలని తెలిపారు.

### ఆలయ భూముల స్వాధీనం

**వీరవాసరం:** వీరవాసరం గ్రూపు ఆలయాలకు సంబంధించిన వ్యవసాయ భూములు ఆక్రమణలకు గురాకావడంతో స్వాధీనం చేసుకున్నామని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఈ.సుబ్బారావు తెలిపారు. వీరవాసరం, తలతాడు తిప్పలోని దేవస్థానం భూములను శుక్రవారం ఆయన పరిశీలించారు. వీరవాసరం గ్రూపు ఆలయాలకు సంబంధించిన 231/2 సర్వే నంబర్‌లో 71 సెంట్లు, 461/2 సర్వే నంబర్‌లో 80 సెంట్లు, 226/3లో 32 సెంట్లు, 14 61/2లో 2 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా మరో 470 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, కోర్టు పరిధిలో ఉండటంతో తీర్పులు వెలువడిన వెంటనే వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న భూములకు సంబంధించి వచ్చేనెలలో వేలం పాట నిర్వహిస్తామన్నారు.

### దేశీయ పశు సంపద అభివృద్ధికి కృషి

**పెంటపాడు:** దేశీయ మేలు జాతి పశు సంపదను అభివృద్ధి పరిచేందుకు సిబ్బంది కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. స్థానిక ఉప సంచాలకుల కార్యాలయంలో శుక్రవారం డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల వెటర్నరీ డాక్టర్లు, ఏడీలు, వీఏఎస్‌లతో ఒక్క రోజు శిక్షణ, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక పథకాలను పాడి రైతులకు వివరించాలన్నారు. అధిక పాల దిగుబడికి జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. ముర్రా, ఒంగోలు జాతుల అభివృద్ధి, ఆడపాడి దూడల అభివృద్ధికి మెళకువలను వివరించారు.

# వాహన మిత్రలకు ఇం‘ధనం’

**10,490 మందికి రూ.10.49 కోట్లు విడుదల**



వాహన మిత్ర చెక్కు అందిస్తున్న కలెక్టర్

**ఏలూరు(మెట్రో):** జిల్లాలో వైఎస్సార్ వాహన మిత్ర పథకం కింద ఐదో విడతలో 10,490 మందికి రూ.10.49 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. విజయవాడలో సీఎం జగన్ బటన్ నొక్కి వాహన మిత్ర పథకాన్ని ప్రారంభించిన కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహన మిత్ర కింద ఏటా రూ.10 వేల సాయం అందిస్తున్నారన్నారు. ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి మాట్లాడుతూ ఆటో, టాక్సీక్యాబ్, మాక్సీ క్యాబ్ వాహన యజమానులు, డ్రైవర్లతో పాటు మొబైల్ పంపిణీ వాహన యజమానులకు (ఎండీయూ), డ్రైవర్లకు కూడా వాహన మిత్ర సాయం అందిస్తున్నారన్నారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా చింతలపూడిలో 1,442 మందికి, దెందులూరులో 1,988 మందికి, ఏలూరులో 1,596 మందికి, గోపాలపురంలోని ద్వారకాతిరుమల మండలంలో 243 మందికి, కైకలూరులో 1,198 మందికి, నూజివీడులో 1,938 మందికి, పోలవరంలో 1,286 మందికి, ఉంగుటూరులో 799 మందికి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ సంఘం నాయకులు కేఎల్ కుమార్, నగరబోయిన లీలాకృష్ణ మాట్లాడుతూ వాహన మిత్ర సాయంతో వాహన బీమా, ఫిట్‌నెస్ ఖర్చులు చెల్లిస్తూ ఆనందంగా జీవిస్తున్నామన్నారు. ఆర్డీఓలు కె.శ్రీహరిరాజు, ఎండీ మదానీ, ఎంవీఐలు కె.విజయరాజు, టి.శివప్రసాద్, సహాయ ఎంవీఐలు పాల్గొన్నారు.

# ఏలూరు నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

**ఎమ్మెల్యే ఆళ్ల నాని వెల్లడి**



ఏలూరులో వాటర్ ఫౌంటెయిన్ పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని. చిత్రంలో కలెక్టర్

**ఏలూరు టౌన్:** ఏలూరు నగరాన్ని సుందరీకరణ చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నామనీ.. నగర ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనతోపాటు నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని చెప్పారు. ఏలూరు నగరంలోని జిల్లాపరిషత్ సమీపంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన వాటర్‌ఫాల్‌ను కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఏలూరులో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించటంతోపాటు నగర అభివృద్ధిపైనా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. నగరాన్ని సుందరీకరణ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పక్కా ప్రణాళికతో పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. నగర ప్రజల మానసిక ఉల్లాసానికి, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా వాటర్‌ఫాల్, ఐ లవ్ ఏలూరు స్లోగన్‌తో తీర్చిదిద్దారని తెలిపారు.

**రూ.4 కోట్లతో పార్కుల అభివృద్ధి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రూ.4 కోట్లతో నగరంలోని పార్కులన్నీ అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే నాని తెలిపారు. మరో రూ.6 కోట్ల నిధులతో నగరంలోని ప్రధాన రహదారులు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. నూతనంగా నిర్మించిన వాటర్‌ఫాల్ ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్టాండ్, జెడ్పీ కార్యాలయానికి సమీపంలో ఉండటంతో ఏలూరు నగర ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ఏలూరు వచ్చే ప్రజలకు ఆకర్షణీయంగా నిలుస్తుందని చెప్పారు. ఏలూరు నగర అభివృద్ధిలో మేయర్ నూర్జహాన్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, కార్పొరేటర్లు, అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, 32వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ బండారు సునీతా కిరణ్, నగర కార్పొరేటర్లు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

# ఆరోగ్య సమాజానికి కృషి



జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న జేసీ లావణ్యవేణి

**ఏలూరు(మెట్రో):** ప్రజలకు ఆరోగ్యం, పోషణ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించి ఆరోగ్య సమాజం నిర్మాణం కోసం కృషిచేయాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా కమిషన్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవంలో భాగంగా ‘ఆరోగ్యవంతమైన సమాజం, అక్షరాస్యత గల భారతదేశంగా స్వసంపన్నమైన దేశం’ అనే అంశములపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏలూరు జోన్‌లోని ఉమ్మడి పశ్చిమ, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో సీడీపీలు, పర్యవేక్షకులు, పోషణ అభియాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ పోషణ అభియాన్‌లో భాగంగా ఏటా నిర్వహించే అవగాహన సమావేశాల ద్వారా ప్రజలకు ఆరోగ్యం, పోషణ సంబంధిత అంశాలపై ప్రజలను మరింత చైతన్యవంతం చేయాలన్నారు. ఏలూరు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు ఉమారాణి మాట్లాడుతూ పోషకాహార లోపాల నివారణపై అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. హోం సైన్స్ కాలేజీ అధ్యాపకురాలు ఎం.పద్మజ రక్తహీనత నివారణ, ప్రొఫెసర్ ఎం.ఎస్తేరురాణి మహిళా సాధికారతపై మాట్లాడారు. డాక్టర్ కె.అరుణ సమాజాభివృద్ధిలో విద్య, ఆరోగ్యం, పోషణ ప్రాముఖ్యతను వివరించారు. మహిళా కమిషన్ సేవలపై కమిషన్ సెక్షన్ అధికారి శైలజ మాట్లాడారు. ప్రాజెక్టు డైరెక్టర్లు కె.ప్రవీణ (కాకినాడ), సువర్ణ (కృష్ణా), నోడల్ అధికారి స్వరాజ్యలక్ష్మి, ఏలూరు ఇన్‌చార్జి పీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పక్కాగా ఆరోగ్య సురక్ష శిబిరాలు



ప్రత్యేకాధికారి శశిభూషణ్‌కుమార్‌తో చర్చిస్తున్న కలెక్టర్

**ఏలూరు(మెట్రో):** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించేందుకు ఏలూరు జిల్లాకు ప్రత్యేకాధికారిగా నియమించిన రాష్ట్ర జలవనరుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ శుక్రవారం ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణ ఏర్పాట్లను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆయనకు వివరించారు. శిబిరాల నిర్వహణకు సంబంధించి ప్రవేశమార్గం నుంచి టోకెన్ల రిజిస్ట్రేషన్, స్క్రీనింగ్, వైద్యుల పరీక్షలు, మందులు పంపిణీ, క్రౌడ్ మేనేజ్‌మెంట్, జగనన్న కంటి వెలుగు శిబిరం, పౌష్టికాహార శిబిరం తదితరాలకు సంబంధించి వివరాలపై ప్రత్యేకంగా రూపొందించిన మ్యాప్‌ను చూపుతూ వివరాలు తెలియజేశారు. జిల్లాలో 14 అర్బన్ హెల్త్ కేంద్రాలతోపాటు 463 రూరల్ ఆరోగ్య కేంద్రాలతో కలిపి మొత్తం 477 కేంద్రాల్లో కార్యక్రమం నిర్వహణకు ప్రణాళిక రూపొందించామన్నారు. వీటి పర్యవేక్షణకు తహసీల్దార్, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో కూడిన 62 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. 130 మంది మెడికల్ ఆఫీసర్లను, 463 కేంద్రాలకు సీహెచ్‌ఓలను మ్యాపింగ్ చేశామన్నారు. 104 వాహనాలను 41 కేటాయించామన్నారు. ఇంటింటి సర్వే కోసం 1,861 మంది ఆశావర్కర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. శనివారం తొలిరోజు 25 గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఏర్పాట్లపై జిల్లా ప్రత్యేకాధికారి సంతృప్తి వ్యక్తం చేశారు.

**మమేకం కావాలి :** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ మమేకం కావాలని సీఎం జగన్ ఆదేశించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి కలెక్టర్లు, వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి ప్రత్యేకాధికారి శశిభూషణ్‌కుమార్, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, డీఎంహెచ్ఓ డా.శర్మిష్ట, జెడ్పీ సీఈవో కె.రవికుమార్, డీసీహెచ్ డా. పాల్ సతీష్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్ఓ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి రమణ పాల్గొన్నారు.

## ● కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆనందోత్సాహాలు



కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆకివీడు మండలం దుంపగడపలో ఆంధ్ర కేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకులు శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. మళ్లీ మళ్లీ జగనే మా ముఖ్యమంత్రి అంటూ నినదించారు. కాంట్రాక్టు అధ్యాపకులు విక్టర్ బాబు, ఎస్.రజనీ, పీవీ సత్యనారాయణ, వైవీఎస్ సుబ్రహ్మణ్యేశ్వరి, పి.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. - ఆకివీడు

# వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం

**ఏలూరు టౌన్:** జిల్లాలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అధ్యక్షుల నియామకం ఇలా.. సుంకర చంద్రశేఖర్ (ఏలూరు క్లస్టర్–1), మంచెం మైబాబు (ఏలూరు క్లస్టర్–2), ఎన్.సుధీర్‌బాబు (ఏలూరు క్లస్టర్–3), తేరా ఆనంద్ (ఏలూరు రూరల్), కామిరెడ్డి వెంకట నరసింహారావు (నాని) (దెందులూరు), అప్పన ప్రసాద్ (పెదపాడు), మొక్కరాళ్ల వెంకట సత్యప్రసాద్ (పెదవేగి), భత్రాజు శివాజీ (కైకలూరు), తిర్మానీ రమేష్ (కలిదిండి), గుమ్మడి వెంకటేశ్వరరావు (మండవల్లి), మోట్రు అర్జునరావు (ముదినేపల్లి)ను నియమించారు. రావిపాటి సత్య శ్రీనివాసులు (భీమడోలు), మరడా వెంకట మంగారావు (ఉంగుటూరు), సంకు సత్యకుమార్ (నిడమర్రు), దండు రామకృష్ణంరాజు (గణపవరం), కొటారి మోహన్ (లింగపాలెం), కొప్పుల నాగు (చింతలపూడి టౌన్), జగ్గవరపు జానకిరెడ్డి (చింతలపూడి), మిడతా రమేష్ (కామవరపుకోట టౌన్, మండలం), అచ్చిరాజు (జంగారెడ్డిగూడెం టౌన్), వామిశెట్టి హరిబాబు (జంగారెడ్డిగూడెం), పలగాని నరసింహరావు (ఆగిరిపల్లి), నాగ మల్లేశ్వరరావు (ముసునూరు), మిద్దే బాలకృష్ణ (చాట్రాయి), శివకుమార్ (నూజివీడు), శీలం రామయ్యారావు (నూజివీడు టౌన్), రామభద్రరాజు (శ్రీను రాజు) (టి.నరసాపురం), నరసింహరాజు (కుకునూరు), అల్లూరి రత్నాజీరావు (బుట్టాయగూడెం), చందా ప్రసాద్ (జీలుగుమిల్లి), బుగ్గా మురళీకృష్ణ (పోలవరం), గొడ్డేటి నాగేశ్వరరావు (కొయ్యలగూడెం), డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ (వేలేరుపాడు)ను నియమించారు.

## క్లుప్తంగా

### మద్ది హుండీ ఆదాయం రూ.38.24 లక్షలు


హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. 64 రోజులకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించగా రూ.36,13,345, నాణేల రూపంలో రూ.1,59,943, అన్నదానం హుండీ ద్వారా 49,775, నాణేల రూపంలో 1,039 మొత్తం 38,24,102 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. దేవదాయ శాఖ తనిఖీదారు ఎ.సుజన్ పర్యవేక్షణలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు.

### సాగరమిత్ర నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, భీమవరం: జిల్లాలో పీఎంఎంఎస్‌వైలో కాంట్రాక్ట్ పద్ధతిపై సాగరమిత్ర నియామకాలకు దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా మత్స్య శాఖాధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 4లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు భీమవరంల మత్స్యశాఖ జేడీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

# అందరికీ ఆరోగ్య సు'రక్ష'

- నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు
- ప్రతి మండలంలోని ఓ గ్రామంలో వైద్య శిబిరం
- ప్రతి శిబిరంలో అందుబాటులో నలుగురు వైద్యులు
- 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు సిద్ధం
- జిల్లాలో 3.73 లక్షల ఇళ్లలో ఆరోగ్య సర్వే పూర్తి


జంగారెడ్డిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

సాక్షి ప్రతినిధి, ఏలూరు: అందరి ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత. ఏ ఒక్కరినీ విడిచిపెట్టకుండా ప్రతి ఇంటికి కనీస వైద్యం అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు ఆరా తీసి ఆయా గ్రామాల్లోనే ప్రత్యేక శిబిరాల ద్వారా పూర్తి స్థాయి వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మండలంలోని ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వీరికి వైద్యం అందించనుంది. ఇలా జిల్లాలోని 477 పంచాయితీల పరిధిలో 475 వైద్య శిబిరాలు, నిష్ణాతులైన డాక్టర్లు, 105 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించే భారీ కార్యక్రమం శనివారం జిల్లాలో ప్రారంభం కానుంది. జగనన్న ఆరోగ్య సురక్ష ఈ నెల 30న ప్రారంభమై నెల రోజుల పాటు కొనసాగనుంది. నెల రోజుల పాటు సమగ్రంగా గిరిజన ప్రాంతాలతో సహా శిబిరాలు నిర్వహించేలా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

జిల్లాలో శనివారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష లాంచనంగా ప్రారంభం కానుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో అన్ని నియోజకవర్గాల్లో, అన్ని మండలాల్లో సురక్ష సభల్లో ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ఇప్పటికే గత 20 రోజుల నుంచి ఈ కార్యక్రమంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. సెప్టెంబర్ 15 నుంచి గ్రామ వలంటీర్, ఆశాకార్యకర్తలు, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు వారిపరిధిలోని ఇళ్ళకు వెళ్ళి వైద్యశిబిరం వివరాలు తెలియచేయడం, ఆతరువాత ఆరోగ్య సర్వే నిర్వహించి అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేసి ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి అన్ని వివరాలను సచివాలయాలు వారీగా, గ్రామ పంచాయితీలువారీగా మ్యాపింగ్ పూర్తి చేశారు. ఇప్పటికే డివిజన్ల వారీగా కార్యక్రమ పర్యవేక్షణకు జిల్లా స్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. ఆయా డివిజన్లల్లో నూరు శాతం ఆరోగ్య సర్వే పూర్తి చేయించడం, షెడ్యూల్ వారీగా వైద్యశిబిరాల నిర్వహణ, వైద్య శిబిరాలకు హాజరయ్యేవారికి ప్రత్యేకంగా టోకెన్లు జారీ తదితర కార్యక్రమాలను పూర్తి చేశారు.

#### తొలిరోజు 25 గ్రామాల్లో క్యాంపులు

సెప్టెంబర్ 30 నుంచి నెల రోజుల పాటు ఆరోగ్య సురక్షక్యాంపులు నిర్వహించనున్నారు. జిల్లాలో 517 గ్రామసచివాలయాల పరిధిలో 477 ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించనున్నారు. మొదటి రోజు 25 గ్రామాల్లో క్యాంపులు జరగనున్నాయి. నెల రోజుల పాటు 477 క్యాంపులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నారు. ఇప్పటికే జిల్లాలో 3.73 లక్షల ఇళ్లకు వలంటీర్లు, ఆశావర్కర్లు వెళ్ళి ఆరోగ్య సేవ ప్రక్రియ పూర్తి చేసి 7 రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. మొత్తంగా 6.70 లక్షల మందికి 7 రకాల పరీక్షలు పూర్తయ్యాయి.

#### క్యాంపుల్లో ఇలా..

సురక్ష క్యాంపుల్లో బీపీ, సుగర్, ఈసీజీతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి క్యాంపులో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులతో పాటు, మరో ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లు, నలుగురు అందుబాటులో ఉంటారు. సాధారణ జబ్బుల నుంచి గుండె జబ్బుల వరకు అన్నింటిని సంబంధించి 105 రకాల మందులను అందుబాటులో ఉంచారు. సురక్ష క్యాంపులో ప్రత్యేకంగా కళ్ళజోళ్ల స్టాల్, పౌష్టికాహారానికి సంబంధించి న్యూట్రిషియన్ స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

జిల్లాలో మొత్తం 168 నిష్ణాతులైన వైద్యులు శిబిరాల్లో పాల్గొంటారు. వీరిలో 20 మంది గైనకాలజిస్టులు, 16 మంది పిల్లల వైద్యనిపుణులు, 18 మంది జనరల్ మెడిసిన్ డాక్టర్లు, 114 మంది అన్ని రకాల విభాగాల నిపుణులు వైద్య సేవల్లో పాల్గొంటారు. 104 వాహనాలు 41 కేటాయించారు. తహశీల్దార్, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో కూడిన 62 బృందాలను ఏర్పాటు చేసి 130 మంది మెడికల్ ఆఫీసర్లు, 463 కేంద్రాల సీహెచ్‌ఓలను మ్యాపింగ్ చేశారు.

#### సద్వినియోగం చేసుకోవాలి



అత్యంత ప్రతిష్టాత్మకంగా జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహిస్తున్నాం. 477 వైద్య శిబిరాలను నిర్వహించి జిల్లాలో ఏ ఒక్కరికీ వైద్య సేవలు అందలేదన్న మాట రాకుండా సిబ్బంది పనిచేస్తారు. గిరిజన ప్రాంతాల్లో కూడా పూర్తి స్థాయిలో శిబిరాలు నిర్వహించి మందులతో పాటు అవసరమైన చోట్ల పౌష్టికాహారం, కళ్ళజోళ్లను పంపిణీ చేయడానికి వీలుగా ఏర్పాట్లు సిద్ధం చేశాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– వె.ప్రసన్న వెంకటేష్, ఏలూరు జిల్లా కలెక్టర్

### కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్


వసంతవాడలో కోళ్ల వ్యర్థాల వాహనాన్ని సీజ్ చేసిన ఎస్సై చల్లా కృష్ణ

పెదపాడు: మండలంలోని పెదపాడులో కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పెదపాడు పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. వసంతవాడ వైపు నుంచి కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై చల్లా కృష్ణ తన సిబ్బందితో వెళ్లి వాహనాన్ని అడ్డుకుని మూడు టన్నుల కోళ్ల వ్యర్థాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వాహన డ్రైవర్, వాహన యజమాని, చేపల చెరువు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్టు

జంగారెడ్డిగూడెం: హత్యాయత్నం కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి శుక్రవారం చెప్పారు. ఈ నెల 28న గణేష్ నిమజ్జన ఊరేగింపులో ఆటోనగర్ లక్ష్మీ టవర్స్‌కు చెందిన కోనాల రాహుల్, గజ్జల వెంకటకుమార్, మరికొందరు పాల్గొన్నారన్నారు. అశ్వారావుపేట రోడ్డులో ఊరేగింపు సమయంలో గజ్జల వెంకట కుమార్, మరో ఐదుగురు పాత గొడవలు నేపథ్యంలో కోనాల రాహుల్‌తో గొడవపడి అతన్ని హతమార్చాలనే ఉద్దేశంతో వెంకట కుమార్ రాహుల్‌పై పెట్రోల్ పోసి నిప్పుపెట్టేందుకు ప్రయత్నించాడని, అతనికి సహకరిస్తున్న మరో ఐదుగురు వ్యక్తులు రాహుల్‌ను కర్రతో చేతులతో కొట్టి గాయపర్చారన్నారు. రాహుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.



# అణగారిన వర్గాలను ఆదుకున్నవారికే మద్దతు


దళిత జేఏసీ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర దళిత జేఏసీ చైర్మన్ చాగంటి సంజీవ్

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తాము మద్దతు ఇస్తామని రాష్ట్ర దళిత జేఏసీ చైర్మన్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్ అన్నారు. స్థానిక నవాబుపేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధితో పాటు వారి రక్షణ కొరకు కృషి చేసే రాజకీయ పార్టీలకు దళిత జేఏసీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ హక్కులను, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరారు. రాష్ట్రంలో వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ వర్గాల రైతుల ఆర్థిక అభివృద్ధి కొరకు, సంక్షేమం కొరకు ప్రభుత్వాలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో దళిత జేఏసీ రాష్ట్ర సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో దళిత సేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు జిజ్జువరపు రవిప్రకాష్, రాష్ట్ర దళిత నాయకుడు కాపుదాసి రవికుమార్ పాల్గొన్నారు.

## ● గడపగడపకు సంక్షేమం


పెదవేగి: భోగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి


టి.నరసాపురం: మధ్యాహ్నపువారిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు బ్రోచర్లను అందిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

### చవితి పందిరిలో అగ్నిప్రమాదం


శ్రీనివాసపురంలో దగ్ధమవుతున్న చవితి పందిరి

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామంలో వినాయక చవితి పందిరిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గ్రామంలో వరసిద్ధి వినాయక 22వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్వామివారి ప్రతిమను ఏర్పాటు చేసిన చలువ పందిరి నుంచి ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంతో ఈ ప్రమాదం సంభవించినట్లు చెబుతున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు మంటలను అదుపు చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమీ కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

### వేధింపులపై కేసు నమోదు


ముసునూరు: వేధింపులకు గురిచేస్తున్న భర్త, బంధువుల నుంచి రక్షణ కల్పించాలని ఓ వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు శుక్రవారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. చింతలవల్లికి చెందిన యలమర్తి స్వామిదాసు కుమార్తె కమలను మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ ద్వారా నిడదవోలు మండలం బ్రాహ్మణగూడెంకు చెందిన దూలపల్లి మునీంద్ర పరిచయం చేసుకున్నాడు. బంధువులతో కలసి కమల ఇంటికి వచ్చి మోసపు మాటలతో పెళ్లి సంబంధం కుదుర్చుకున్నారు. 2021 ఆగస్టు 13న వీరికి వివాహం జరిగింది. తొలి రోజు నుంచే అనుమానపు మాటలతో భర్త వేధింపులు గురిచేయడం ప్రారంభించాడు. కొంత కాలం నుంచి అదనపు కట్నం కావాలని వేధిస్తూ చంపాలని ప్రయత్నిస్తున్నాడు. బంధువులతో కలసి శారీరక, మానసిక వేధింపులు ఎక్కువవడంతో పోలీసులను ఆశ్రయించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

### తెలంగాణ మద్యం సీజ్


మద్యం బాటిళ్లతో పెదపాడు పోలీసులు

పెదపాడు: తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి అమ్ముతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 59 బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ శుక్రవారం చెప్పారు. అప్పనవీడులో తెలంగాణ నుంచి తీసుకువచ్చిన మద్యం అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు దేవనబోయిన సురేష్ ఇంటికి వెళ్లి తనిఖీ చేయగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుమారు రూ.30 వేల విలువైన 59 మాన్షన్‌హౌస్ ఫుల్ బాటిళ్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### మార్టేరులో బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం


మార్టేరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: బాస్కెట్‌బాల్ క్రీడలలో రాష్ట్రానికి జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావడానికి కృషి చేయాలని ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మార్టేరులో నాలుగు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి 9వ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో అందరూ విజేతలు కాలేరని, ఓటమి స్ఫూర్తితోనే విజయానికి మరో ముందడుగు వేయాలన్నారు. బాల్యదశ నుంచే క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. జాతీయ స్థాయి గుర్తింపు పొందిన స్థానిక క్రీడాకారుడు సత్తి ప్రహ్లాదరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మార్టేరులో స్పోర్ట్స్ హాస్టల్ నిర్వహణకు తనవంతు సహకారం అందిస్తానని, జాతీయ స్థాయిలో బాస్కెట్‌బాల్ క్రీడాకారుల శిక్షణ కార్యక్రమాన్ని కూడా మార్టేరులోనే ఏర్పాటు చేయాలని కోరారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. మార్టేరు సర్పంచ్ మట్టాకుమారి అధ్యక్షత వహించగా ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి.చక్రవర్తి, జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, సత్తివెంకటరెడ్డి, మేడపాటి చిరంజీవిరెడ్డి, యూత్ బాస్కెట్ బాల్ జిల్లా అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, కర్రి అనురాధ జోగిరెడ్డి, ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు, సొసైటీ అధ్యక్షుడు అల్లం భాస్కరరెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీసభ్యులు అంతర్జాతీయ క్రీడాకారులు సత్తి సుబ్బన్నరెడ్డి పాల్గొన్నారు.

# బాలిక హత్య కేసులో బాబాయ్ అరెస్టు


బాలిక హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: భీమవరం లెప్రసీ కాలనీలో ములుకు రత్నకుమారి (12) హత్య కేసులో నిందితుడు వరుసకు బాబాయ్ అయిన ములుకు శివ (మావుళ్లు)ను అరెస్టు చేసినట్లు ఎస్పీ యు.రవిప్రకాష్ చెప్పారు. కేసు వివరాలను వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించారు. లెప్రసీ కాలనీలో నివాసముంటున్న ములుకు అంజి, దుర్గ దంపతుల కుమార్తె రత్నకుమారి ఈనెల 26వ తేదీ నుంచి కనిపించడం లేదని ఈ నెల 27న వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో దుర్గ ఫిర్యాదు చేసిందన్నారు. బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా, 28న బాలిక మృతదేహం వారి ఇంటి వెనుక గల జమ్ముగడ్డి తోటలో కనిపించడంతో అదృశ్యం కేసును హత్య కేసుగా మార్చి చేసి దిశ డీఎస్పీ ఎన్.మురళీకృష్ణ దర్యాప్తు చేపట్టారని ఎస్పీ వివరించారు. అయితే బాలికను హత్య చేసిన మృతురాలికి వరుసకు చిన్నాన్న అయిన మావుళ్లు తనపై బాలిక బంధువులు దాడి చేస్తారనే భయంతో శుక్రవారం సాయంత్రం డిప్యూటీ తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ వద్ద లొంగిపోయి బాలిక మరణానికి తానే కారణమని ఒప్పుకున్నట్లు ఎస్పీ వివరించారు. దీంతో మావుళ్లును అరెస్టు చేసినట్లు చెప్పారు. అయితే బాలిక ఎలా మృతి చెందిదనే విషయం పోస్టుమార్టం రిపోర్టులో తెలియాల్సి ఉందన్నారు. దిశ డీఎస్పీ మురళీకృష్ణ, భీమవరం డీఎస్పీ బందారు శ్రీనాథ్, సీఐ అడబాల శ్రీను, ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# బాధితులకు అండగా వైఎస్సార్ బీమా

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- మృతుడి కుటుంబానికి బీమా మంజూరు పత్రాల అందజేత


తణుకులో బాధిత కుటుంబానికి బీమా పత్రాలు అందిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: ప్రమాదాల్లో మృతుల కుటుంబాలకు వైఎస్సార్ బీమా ఆర్థికంగా అండగా నిలబడుతుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ బీమా మంజూరు పత్రాలను మంత్రి కారుమూరి మృతుడి భార్య, పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రమాదాల్లో మృతి చెందిన వారికి ముఖ్యమంత్రి పెద్ద మనస్సుతో సత్వరమే ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. ఈనెల 11వ తేదీన తణుకులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొబ్బరితీత కార్మికుడు కొలుసు రాము మృతి చెందగా, అదే రోజు మట్టి ఖర్చులకు రూ.10 వేలు ప్రభుత్వం తరపున అందజేశారని, ఇప్పుడు మిగిలిన రూ.4,90,000 నేరుగా మృతుడి భార్య సత్యవతి బ్యాంకు అకౌంట్‌కు జమ చేసినట్లు చెప్పారు. జగనన్న ప్రభుత్వం ఎంత పారదర్శకంగా పనిచేస్తుందో ఈ ఘటన ఒక నిదర్శనమని అన్నారు. చనిపోయిన మనిషిని తెచ్చివ్వలేమని, మానవతా దృక్పథంతో వైఎస్సార్ బీమా ద్వారా ఆ కుటుంబానికి జగనన్న అండగా ఉన్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు తినగా మిగిలిన సొమ్ము బాధితులకు అందజేసేవారని గుర్తు చేశారు. మృతుడి కుమారులిద్దరికీ అవసరమైన సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, ఇల్లింద్రపర్రు సొసైటీ అధ్యక్షులు మల్లిరెడ్డి నాగార్జున, జల్లూరి జగదీష్, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

### మోగల్లులో పట్టపగలే చైన్ స్నాచింగ్

పాలకోడేరు: మోగల్లులో పట్టపగలు చైన్‌స్నాచింగ్ ఘటన చోటు చేసుకుంది. బస్సు కోసం నిరీక్షిస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు తాడును గుర్తు తెలియని ఆగంతకుడు తెంపుకుని అప్పటికే సిద్ధంగా స్కూటీపై పరారయ్యాడు. వివరాలిలా వున్నాయి. మోగల్లు గ్రామానికి చెందిన కూసంపూడి రామసీత తణుకు వెళ్లేందుకు గ్రామంలోని గంగానమ్మ గుడి వద్ద బస్సు కోసం నిరీక్షిస్తోంది. ఆ సమయంలో ఇద్దరు యువకులు స్కూటీపై వచ్చి ఆమె వద్ద ఆపారు. బండి నడుపుతున్న వ్యక్తి గొల్లలకోడేరుకు ఎటు వెళ్లాలంటూ రామసీతను అడిగాడు. అంతలోనే స్కూటీపై వెనుక కూర్చున్న యువకుడు రామసీత మెడలోని సూత్రాల తాడును తెంపుకుని వచ్చిన దారినే పరారయ్యారు. బాధితురాలు రామసీత వెంటనే తేరుకుని లబోదిబోమంటూ పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు యువకులకు 25 ఏళ్ల వయసు ఉండవచ్చని, నంబర్ ప్లేట్ లేని తెలుపు రంగు స్కూటీపై వచ్చారని, ఇద్దరూ నలుపు రంగు మాస్క్ ధరించారని, వెనుక కూర్చున్న యువకుడు నలుపు రంగు షర్ట్ వేసుకున్నాడని, ముందు కూర్చున్న యువకుడికి జుట్టు ఎక్కువగా ఉందని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు.